## కేసీఆర్ పాలనలో గ్రామాలు అభివృద్ధి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, మార్చి 17 : రాష్ట్రంలోని అన్ని గ్రామాలు కేసీఆర్ పాలనలో అభివృద్ధి చెందాయని చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్ తెలిపారు.మండలంలోని కాశేగుడిసెల గ్రామానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన రూ.4లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందనుందన్నారు.అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి లేదని, కేవలం వారి పార్టీ ప్రచారాన్ని చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వం ధ్యేయమనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు విస్మరించి నిత్యం బీఆర్ఎస్ పార్టీ పై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు షేక్ కమల్, మాజీ సర్పంచ్‌లు షేక్ సమీర్, దినేశ్‌తివారీ, బీఆర్ఎస్ నాయకులు షేక్ ఇమామ్, సుభాన్, జమీర్, నజీర్ పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష



గజ్వేల్‌లో నిరసన దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

గజ్వేల్, మార్చి 17: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యలంలో గ్రూప్-1,2,3 ఉద్యోగాలు నిలిపివేయాలంటూ సోమవారం పట్టణంలో చేపట్టిన నిరసన దీక్షను ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెబర్తి యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యంగా మంద కృష్ణ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. ఉద్యమాన్ని దెబ్బతీయాలని పాలకులు ఎన్నో కుట్రలు చేసినా కృష్ణమాదిగ వాటిని ఛేదించారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ఆంజనేయులు, మహేశ్, రాజు, వెంకటేశ్, నవీన్, యాదగిరి, నాగరాజు పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయంలో టెండర్లు ఖరారు

చేర్యాల, మార్చి 17 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం ఆలయ ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆలయానికి సంబంధించి వివిధ టెండర్లు నిర్వహించారు. సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలంలో పూజా సామగ్రి విక్రయించుకునే షాపు నెంబర్(1) హక్కులను జి.దశరథం అనే వ్యక్తి రూ.7లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. పూజాసామగ్రి విక్రయించుకునే షాపు నెంబర్(2) హక్కులను కె.శ్రీనివాస్ అనే వ్యక్తి రూ.6,05,000 పాడి టెండర్ దక్కించుకున్నారు. సెల్‌ఫోన్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులకు సరైన పాట రాకపోవడంతో ఆలయ ఈవో టెండర్లను వాయిదా వేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు సురేందర్, శ్రీరాములు, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



కొమురవెల్లి నూతన తహసీల్దార్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి, మార్చి 17 : ఇటీవల కొమురవెల్లి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన దివ్యను సోమవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గీస భిక్షపతి, మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తలారి కిషన్, పడిగన్నగారి మల్లేశం, ఈగ యాదగిరి, వంశీ, లకుడబోయిన రమేశ్, కంకణాల నరేశ్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి



మిరుదొడ్డి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

మిరుదొడ్డి, మార్చి 17 :అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆశ వర్కర్ల మండల అధ్యక్షురాలు బాలమణి అన్నారు. సోమవారం మిరుదొడ్డి తహసీల్దార్ ఉదయ శ్రీకి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు మాలతి, ఇంద్ర, స్వప్న పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం



నిరుపేదకు ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల, మార్చి 17 : పట్టణానికి చెందిన గుస్క నర్సవ్వ ప్రమాదవశాత్తు కిందపడి తొంటి ఎముక విరిగిమంచానికే పరిమితమైంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిమ్మ రాజిరెడ్డి మనువడు యూత్ నాయకుడు నిమ్మ నిఖిల్‌రెడ్డి సోమవారం వృద్ధురాలికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.కార్యక్రమంలో నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి అనిత దంపతులతో పాటు సీనియర్ నాయకుడు గుస్క కృష్ణ ఉన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్, మార్చి 17: నమ్మించి ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆరోపించారు. మండలంలోని అహ్మదీపూర్‌లో సోమవారం గ్రామానికి చెందిన చాకలి విజయకు రూ.15వేలు, గురుమూర్తికి రూ.22,500, బాలమణికి రూ.16,500, తోట జగదీశ్వర్‌కు రూ.54వేలు, బోయిని కనకయ్యకు రూ.27వేలు, కుమ్మరి మల్లయ్యకు రూ.17వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశామన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాల రమేశ్‌గౌడ్, నాయకులు రాజిరెడ్డి, అహ్మద్, నిజామొద్దీన్, కృష్ణారెడ్డి, రాములు గౌడ్, రమేశ్, భూపతి, నరేశ్ పాల్గొన్నారు.

## సద్దిమూట శతకం పుస్తక ఆవిష్కరణ



సయ్యద్ దంపతులను సన్మానిస్తున్న మాజీ జడ్పీ చైర్ పర్సన్ రోజారాధకృష్ణశర్మ

కొమురవెల్లి, మార్చి 17 : మండలంలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎండీ.సయ్యద్ రచించిన సద్దిమూట శతకం పుస్తక ఆవిష్కరణ సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రఘూత్తంరెడ్డి, జడ్పీమాజీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి హాజరై మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణగౌడ్, రంగనాయక సాగర్ రచయితల సంఘం అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, ఉపాధ్యాయులు, రచయితలు పాల్గొన్నారు.

## కుష్ఠువ్యాధి నిర్మూలనకు సహకరించాలి

సిద్దిపేట, మార్చి 17 : కుష్ఠువ్యాధి నిర్మూలనకు అందరూ సహకరించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వాన్ కుమార్ అన్నారు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్ కుమార్ అధ్యక్షతన జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా సోమవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈనెల 17 నుంచి 30 వరకు క్షేత్రస్థాయిలో ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్న వారిని ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# బీఆర్ఎస్ శ్రేణులకు కేసీఆర్ అండ

**బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేసిన ప్రతాప్‌రెడ్డి**



కుకునూరుపల్లిలో మృతుడి కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 17 : ఏం కష్టం వచ్చినా బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అధినేత కేసీఆర్, బీఆర్ఎస్ అండగా ఉంటుందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రానికి చెందిన ముస్త్యాల నర్సింహులు ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. అతడికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉంటడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సహకారంతో మంజూరైన రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కును సోమవారం మృతుడు నర్సింహులు కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో 97,500 బీఆర్ఎస్ సభ్యత్వాలు ఉండగా ఇప్పటి వరకు 382 మంది కార్యకర్తలు వివిధ ప్రమాదాల్లో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు రూ.7కోట్ల 64లక్షలు అందజేశామన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టి ప్రజలకు అండగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అమలుకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలనలో విఫలమైందని ఆరోపించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. సాగునీరు రాక ఉమ్మడి కొండపాక మండలంలో పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీరవీందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, ఈజీఎస్ మాజీ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణా రవీందర్, మాజీ సర్పంచ్‌లు కోల శ్రీనివాస్, మహిపాల్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు హాజి, గ్రామశాఖ అధ్యక్షుడు మల్ల మైలయ్య, నాయకులు అహ్మద్, శంకర్, సంపత్ పాల్గొన్నారు.

## వెనుకబడిన విద్యార్థులకు కృత్రిమ మేధతో బోధన

**సెక్టోరియల్ జిల్లా ఆఫీసర్ భాస్కర్**



నర్సాయపల్లిలో ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి17: విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులకు కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)తో బోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్ అన్నారు. సోమవారం మద్దూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీయూపీఎస్ గాగిళ్లాపూర్, ఎంపీపీఎస్ నర్సాయపల్లి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఏఎక్స్‌ల ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ల్యాబ్‌ను ఎంఈవో వరదరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వెనుకబడిన పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యబోధన చేసేందుకు యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ప్రయోగాత్మకంగా ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో మాత్రమే ఉపయోగిస్తున్న ఈ విధానం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టే ఆలోచనను ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేర్, ప్రసన్నలక్ష్మి, ఖాజా, రామకృష్ణ, సయ్యద్ సర్వర్, కార్తిక్, శివారెడ్డి, ఆగారెడ్డి, కరుణాకర్, సిద్ధారెడ్డి, హరిప్రసాద్, ఆడెపు శ్రీను, సుంకరి రాజేశం, ముక్తార్, ముస్తాయిద్ పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో పశువుల అంగడి వేలం వాయిదా



హుస్నాబాద్‌లో అంగడివేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుస్నాబాద్‌టౌన్, మార్చి 17: హుస్నాబాద్ పశువుల అంగడి వేలం సోమవారం వాయిదాపడింది. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా పలువురు కాంట్రాక్టర్లు హాజరయ్యారు. గత ఏడాది కోటిఇరవైలక్షల ఇరవైవేలకు టెండర్ ఖారారు కాగా ఈ ఏడాది వేలంపాటను మున్సిపల్ సిబ్బంది కోటి ఇరవైలక్షల ఇరవై ఏడువేల మూడువందల రూపాయల ధర నుంచి ప్రారంభించారు. దాదాపు నలభై నిమిషాలకుపైగా వేలంపాట జరిగినప్పటికీ ఏ ఒక్కరూ పాట పాడేందుకు ఆసక్తిచూపలేదు. పైగా గతంలోనే అంగడి వేలం ధర పెరగడంతో నష్టం జరిగిందని, ధర తగ్గిస్తే పాట పాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పలువురు కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్‌కు వివరించారు. హుస్నాబాద్‌కు చుట్టుపక్కల కూడా కొత్తగా అంగళ్లు ప్రారంభంకావడంతో హుస్నాబాద్‌కు వచ్చే పశువుల సంఖ్య, వస్తువుల విక్రయాలు సైతం తగ్గాయని, ధర తగ్గించాలంటూ వారు విన్నవించారు. పశువుల రవాణాను సైతం కొందరు పదేపదే అడ్డుకుంటున్నారని తద్వారా అంగడి ఆదాయం సైతం భారీగా తగ్గిందని, ధర తగ్గించి వేలం పాట నిర్వహించాలని వారు కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. దీంతో అంగడి వేలం వాయిదావేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. కాంట్రాక్టర్ల విన్నపాలను మున్సిపల్ ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల ప్రకారం మరోసారి వేలంపాటకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, మార్చి 17: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, అబ్దుల్‌హమీద్‌తో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 43 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీవో జయదేవ్‌ఆర్యా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్**

కలెక్టరేట్ కార్యాలయం పక్కన ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ మను చౌదరి సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. త్రైమాసిక కాల పరిశీలనలో భాగంగా గోడౌన్ చుట్టూ కలియతిరిగారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం చుట్టూ సీసీ కెమెరాల పనితీరు, పోలీస్ అధికారుల బందోబస్తు ఏర్పాటు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు.

## కారుణ్య నియామకాలు చేపట్టాలి

గజ్వేల్, మార్చి 17: వీఆర్ఏ వారసులకు జీవో నెంబర్ 81, 85 ప్రకారం వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని వీఆర్ఏ వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల లక్ష్మణ్ కోరారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద వీఆర్ఏలతో కలిసి ఆయన మాట్లాడారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 20555 మంది వీఆర్ఏలు ఉండగా అందులో 16758 మందికి మాత్రమే నియామకపత్రాలు ఇచ్చారని, మిగిలిన వారికి వెంటనే ఇచ్చే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు నిరుడి శ్రీనివాస్, నర్సింహులు, సుందర్, వెంకటయ్య, భిక్షపతి, శ్రీనివాస్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షలపై విద్యార్థులు ఆందోళన చెందొద్దు

దుబ్బాక, మార్చి17: టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు ఆందోళనకు గురి కావద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ సూచించారు. సోమవారం దుబ్బాక కస్తూర్బా పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు పరీక్షలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పరీక్షలంటేనే విద్యార్థులు అనవసరంగా ఒత్తిడికి గురై, ఆందోళన చెందుతున్నారన్నారు. ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

**ధర్మాజీపేటలో...**

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో ప్రభుదాస్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



మద్దూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఆనంద్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి17: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని హుస్నాబాద్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్ సూచించారు. సోమవారం మద్దూరు పీహెచ్‌సీని ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ పునరుద్ధరణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రజిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



చంద్లాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ

చిన్నకోడూరు, మార్చి 17 : మండలంలోని చంద్లాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ సోమవారం భూమిపూజ చేశారు. మాజీ సర్పంచ్ చంద్రకళారవిగౌడ్, మాజీ ఎంపీటీసీలు దుర్గారెడ్డి, చంద్రమౌళిగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు మహేందర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు లింగం పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

అక్కన్నపేట, మార్చి 17: మండలంలోని గోవర్ధనగిరిలో సుమారు 10 క్వింటాలు నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బత్తుల అంకూస్ గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నాడు.ఓ ఇంటిలో అడ్డా ఏర్పాటు చేసుకొని చుట్టు పక్కల ఊళ్లలోకి వెళ్లి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ అక్కడ నిల్వచేస్తున్నాడు. భారీగా రేషన్ బియ్యం నిల్వ ఉంచాడనే పక్కా సమాచారం మేరకు పోలీసులు గ్రామంలోకి వెళ్లి తనిఖీ చేయగా రేషన్ బియ్యం దొరికాయి. బియ్యం స్వాధీనం చేసుకోవడతోపాటు నిందితుడిని అదుపులోకి తీసుకొని రెవన్యూ గిర్దావర్ యాదగిరికి సమాచారం అందించామన్నారు. అక్కడికి చేరుకున్న గిర్ధావర్ రేషన్ బియ్యాన్ని పరిశీలించి పంచనామా చేసి బియ్యాన్ని సివిల్‌స్లపయ్ గోదాంకు తరలించారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన ఫర్నిచర్‌లో కూర్చున్న విద్యార్థులు

ములుగు, మార్చి 17 : ఉన్నత లక్ష్యంతో చదవాలని ఎంపీడీవో స్వర్ణకుమారి విద్యార్థులకు సూచించారు. మండలంలోని సింగన్నగూడ ప్రాథమిక పాఠశాలకు మాజీ సర్పంచ్ బొల్లెపల్లి బాలకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ కాంచనపల్లి స్వామిగౌడ్ సహకారంతో రూ. 26వేల విలువ చేసే ఫర్నిచర్‌ను పాఠశాలకు బహూకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో స్వర్ణకుమారి హాజరై మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కలను నిజం చేయాలని కోరారు. పాఠశాలకు ఫర్నిచర్ బహూకరించిన బాలకృష్ణ, స్వామిగౌడ్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి, హెచ్ఎం క్రాంతికుమారి, గ్రామ ప్రత్యేకాధికారి రామచంద్రం, పంచాయతీ కార్యదర్శి సతీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


## హెర్తింగ్‌కు ట్యాంకర్‌తో నీళ్లు



పాండవుల చెరువుకట్టపై ట్రాన్స్‌ఫార్మర్ హెర్తింగ్‌కు ట్యాంకర్ ద్వారా నీళ్లు పడుతున్న రైతు

గజ్వేల్, మార్చి 17: గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువుకట్టపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిత్యం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నది. రైతులే స్వయంగా హెర్తింగ్‌కు ట్యాంకర్ ద్వారా నీళ్లు పట్టారు. వారంలో మూడు, నాలుగు సార్లు ట్రిప్ అవడంతో పాటు ఫీజు వైర్ కొట్టేస్తుందని, ఫీజువైర్ కొట్టేయకుండా ఉండేందుకు హెర్తింగ్‌కు అధికారుల సూచనలతో ట్యాంకర్ ద్వారా నీళ్లు పట్టినట్లు రైతులు తెలిపారు.

## ఎన్ఆర్ఈజీఎస్ పనులపై ప్రజావేదిక



మాట్లాడుతున్న బాలకృష్ణ

మిరుదొడ్డి, మార్చి 17 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023-2024లో చేసిన పనుల్లో భాగంగా సోమవారం మిరుదొడ్డి మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీఆర్డీవో బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2023-2024లో ఉమ్మడి మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని 20 గ్రామ పంచాయతీల్లో చేసిన పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రజావేదికలో వివరించారు. అందులో భాగంగా రూ.4 కోట్ల వరకు గ్రామాల్లో పనులు జరిగితే రూ.3,50 కోట్ల పనులు కూలీలు చేయగా రూ.50 లక్షల వరకు సామగ్రికి చెల్లించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈజీఎస్ అధికారులు పనులు చేయకపోవడంతో రూ.లక్షా86 వేల రికవరీతో పాటు అధికారులకు ఫైన్ విధించారు. ఎస్ఆర్‌పీ గంగరాజ్, ఏపీడీ శివాజీ, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## మాల ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక

సిద్దిపేట టౌన్,మార్చి 17 : సిద్దిపేట ప్రశాంత్‌నగర్ మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా ర్యాకం మల్లేశం,ఉపాధ్యక్షుడిగా దండు సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శిగా రాళ్ల బండి పద్మయ్య,కార్యదర్శిగా తిక్క చంద్రమౌళి,కోశాధికారిగా మాడుగుల శ్రీనివాస్,సహాయ కార్యదర్శిగా రాస రవీందర్,సమాచార ప్రతినిధిగా మాడుగుల శివరాజం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## నేడు డయల్ యువర్ డీఎం

గజ్వేల్, మార్చి 17: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని గజ్వేల్ డీఎం పవన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు సలహాలు, సూచనలు చేసే వారు సెల్: 9959226270 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

## అనారోగ్యంతో రైతు ఆత్మహత్య

దుబ్బాక,మార్చి17: దుబ్బాక మండలం ఆకారం గ్రామంలో ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దుద్దెడ లక్ష్మయ్య (55) అనే రైతు తనకు ఉన్న ఎకరన్నర భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. లక్ష్మయ్య కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఆరు నెలల కిందట పెద్దపేగుకు శస్త్ర చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. ప్రైవేట్ దవాఖానలో ఖరీదైన వైద్యం చేయించలేని పరిస్థితి, తీవ్రమైన కడుపునొప్పితో బాధ పడుతున్న లక్ష్మయ్య జీవితంపై విరక్తి చెందాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

## ఫలించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషి

చేర్యాల, మార్చి17: దేవాదుల ప్రాజెక్టులో భాగంగా తపాస్‌పల్లి, గండిరామారం, బొమ్మకూరు, కన్నబోయిన గూడెం, వెల్దండ, లద్నూర్ రిజర్వాయర్లు నింపి జనగామ నియోజకవర్గంలోని ఆయకట్టు ప్రాంతానికి సాగునీళ్లు ఇవ్వాలని అసెంబ్లీ లోపల, వెలుపల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. నీళ్ల కోసం రైతులు తండ్లాడుతుంటే అధికారులు, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదని అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వంపై ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. తమ ఒత్తిడికి తలొగ్గి ఎట్టకేలకు ఈ నెల 19న దేవన్నపేట నుంచి ధర్మసాగర్‌కు వచ్చే థర్డ్‌పేస్‌ను భారీనీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆన్ చేయనున్నట్లు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. 60 రోజుల్లో కేవలం 40 రోజులు మాత్రమే పంపులు నడపడం శోచనీయమన్నారు. 34రోజుల పాటు ఓఎన్‌డీఎంలు సమ్మె చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. జనగామ నియోజకవర్గంలోని దేవాదుల ఆయకట్టులో ఉన్న భూములు 50శాతం పూర్తిగా ఎండిపోయినట్లు తెలిపారు. రోజూ రైతులు తమ సమస్యలను తన దృష్టికి తీసువస్తే వాటిని ఇరిగేషన్ అధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అసెంబ్లీ వేదికగా, స్టేషన్‌ఘనపూర్‌కు సీఎం వచ్చిన సందర్భంగా పంపులు ఆన్‌చేయమని విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడైనా 3వ ఫేస్ ఆన్ చేయడంతో పాటు ధర్మసాగర్ నుంచి గండిరామారం వరకు ఉన్న నాలుగు పంపులు ఆన్‌చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. పంపులు, మోటర్లను ఆన్ చేసి రిజర్వాయర్లు, చెరువులు నింపి పంటలు కాపాడాలని, నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతుల తరపున డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## నీటిసంపులో పడి వ్యక్తి మృతి

ములుగు, మార్చి 17 : నీటి సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వంటిమామిడి గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తానేదార్‌పల్లికి చెందిన జామకాయల నర్సింహులు (40) దినసరి కూలీగా జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి నర్సింహులు వెళ్లిపోయినట్లు అతడి భార్య సబిత తెలిపింది. సోమవారం వంటిమామిడిలో గ్రామ శివారులోని నీటి సంపులో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం జమకాయల నర్సింహులుగా గుర్తించి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడిగా భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టాలి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి17: ఉజ్వల భవిష్యత్ కోసం కష్టపడి చదవాలని ధూళిమిట్ట తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ విద్యార్థులకు సూచించారు. సోమవారం ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ డీఎస్టీ పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే తప్పా ఇతర వ్యాపకాల మీద దృష్టి పెట్టరాదన్నారు.అనంతరం పదో తరగతి విద్యార్థులకు తహసీల్దార్ పరీక్ష సామగ్రి అందజేశారు. పాఠశాల కోసం కృషి చేసిన తహసీల్దార్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు.

## మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

మద్దూరు(ధూళిమిట్ట),మార్చి17: మద్దూరు మండలంలోని సలాఖపూర్‌లో ఇటీవల లక్ష్మీనర్సమ్మ మృతి చెందింది. సోమవారం మృతురాలి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ మండల నాయకుడు అనిల్‌కుమార్ పరామర్శించి 50కిలోల బియ్యం అందజేశారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

## పీపుల్స్ దవాఖానలో ఆరోగ్యశ్రీ సేవలు

సిద్దిపేట, మార్చి 17: సిద్దిపేట పట్టణంలోని పీపుల్స్ సూపర్ స్పెషాలిటీ దవాఖానలో ఆరోగ సేవలు అందుబాటులోకి వచ్చాయని దవాఖాన నిర్వాహకులు డాక్టర్ కిషన్, తిరుపతి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద న్యూరో సర్జరీ, న్యూమరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ, పల్మనాలజీ, ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ సేవలు అందించనున్నట్లు తెలిపారు. త్వరలోనే ఆర్థోపెడిక్ జనరల్ సర్జరీ సేవలు ఆరోగ్యశ్రీ కింద అందుబాటులోకి రానున్నాయన్నారు. వైద్యులు దీపక్ జాదవ్, పున్నం చందర్, వర్మ, నిర్వాహకుడు ప్రదీప్ పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

కోహెడ, మార్చి 17: మండలంలోని తంగళ్లపల్లి ఉన్నత పాఠశాలలో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులకు సోమవారం తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడారు. ఏఏపీసీ చైరపర్సన్ మ్యాదరి లావణ్య, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, బాలయ్య, శ్రీరామ్, యాదమ్మ, రంగనాయకి, అశ్విని, లక్ష్మీనారాయణ, సీఆర్‌పీ రాజేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.